కథ

# ఆకలి-అతిథి

ప్రతాప రవిశంకర్

దీనదయాళ్ బస్టాపు దగ్గర నిలుచుని ప్యాంటుజేబులో చెయ్యిపెట్టి జేబులో వున్న చిల్లర నాణేలను బయటకుతీసి లెక్కపెట్టాడు. ఆరు రూపాయలు వున్నాయి. అప్పటికి అలా అంతకు ముందు కొన్నిసార్లు లెక్కపెట్టి జేబులో వేసుకున్నాడు. ఎన్నిసార్లు లెక్కపెట్టినా ఒక్క రూపాయి కూడా పెరగలేదు. అంతటి విషాదంలోనూ అతడికి నవ్వొచ్చింది. ఎన్నిసార్లు లెక్కపెట్టినా జేబులో లేని డబ్బులు ఎక్కడినించి వస్తాయని?


అతను అలా మాటిమాటికీ జేబులో నించి చిల్లర డబ్బులను తీసి లెక్క పెట్టటాన్ని అతని పక్కనే నిల్చున్న దీక్షితులు చూస్తూనే వున్నాడు. దీనదయాళ్ ప్రవర్తన ఆయనకు కొంచెం వింతగా అనిపించినా విషయం ఆయనకు కొంతవరకు అర్థమయ్యింది.

దీనదయాళ్ రూపం, ప్రవర్తన అతడి పేదరికాన్ని బాగా సూచిస్తున్నాయి. అతను చవకబారు మాసిపోయిన బట్టలు ధరించాడు. ఓ మాదిరిగా పెరిగిన గడ్డం, బాగా ఎండలో తిరిగినందువల్ల మాడిపోయినట్టు వున్న వొంటి రంగు అతడి పరిస్థితిని సూచిస్తున్నాయి.

ఆ బస్టాపుకు సరిగ్గా ఎదురుగా ఒక భోజన హోటలు వుంది. భోజన సమయం కావటంతో చాలామంది ఆ హోటల్లోకి వెళ్లి భోజనం చేసి బయటకు వస్తున్నారు. అలా లోపలకు వెళ్లి బయటకువస్తున్న వాళ్లని అసూయగా చూస్తూన్నాడు దీనదయాళ్. అతడికి బాగా ఆకలిగా వుంది. రాత్రి కూడా భోజనం చెయ్యలేదు.

బాగా ఎండగా వుంది. మధ్యాహ్నం. రోడ్డు మీద మోటారు వాహనాలు అప్పుడప్పుడు తిరుగుతున్నాయి.

దీనదయాళ్ ఆలోచిస్తున్నాడు. తన దగ్గర వున్న డబ్బులతో భోజనం కాదుగదా కనీసం ఏ రకమయిన టిఫిన్ ఐటమ్ కూడా రాదు. ఒకవేళ ఆ డబ్బులతో ఏదయినా తిన్నా, సిటీ బస్సులో ఇంటికి వెళ్లటానికి డబ్బులు వుండవు. నాలుగు కిలోమీటర్లు ఆ ఎండలో నడిచి వెళ్లాలి.



ఆ బస్టాపుకు కొంచెం దగ్గరలో వున్న ఓ ఫ్యాన్సీ షాపులో ఓ గుమస్తా ఉద్యోగం గురించి అడగటానికి వచ్చాడు దీనదయాళ్. అడిగాడు. కానీ రెండ్రోజుల క్రితమే ఖాళీగా వున్న ఆ ఉద్యోగంలో ఎవరో జేరారుట. ఖాళీ లేదు. నిరాశపడ్డాడు అతను.

ప్రస్తుతం దీనదయాళ్‌కు ఏ పనీ లేదు. ఖాళీగా వున్నాడు. ఇంతకుముందు దీనదయాళ్ ఓ పుస్తకాల షాపులో గుమాస్తాగా పని చేసేవాడు. కానీ ఇరవై రోజుల క్రితం నష్టం వస్తోందని ఆ షాపు యజమాని దాన్ని మూసేశాడు. అంతటితో దీనదయాళ్ ఉద్యోగం పోయింది. అతడు అక్కడ పని చేసిన రోజులకు ఇచ్చిన జీతంతో ఓ వారం రోజుల క్రితం వరకు గడిపాడు అతను. తర్వాత ఇల్లు గడవలేదు. అందువలన భార్య, ఇద్దరు పిల్లలను భార్య పుట్టింటికి పంపించి తను వొక్కడే వుంటున్నాడు ఇంట్లో. క్రితం రోజు వరకూ బాగా తెలిసిన స్నేహితుల దగ్గర అప్పులు చేస్తూ గడిపాడు. ఇప్పుడు అతనికి అప్పుకూడా దొరకటం లేదు. మరో ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూనే వున్నాడు. కానీ దొరకలేదు.

బస్టాపు ఎదురుగా వున్న హోటల్లోకి వెళ్లే మనుషులను బాగా పరీక్షగా చూస్తున్నాడు దీనదయాళ్. ఎందుకంటే ఎవరయినా తెలి

సిన మనుషులు కనపడితే వాళ్లతో చెప్పి తనుకూడా వాళ్లతో కలిసి భోజనం చెయ్యవచ్చు. ఇదీ అతడి ఆలోచన.

మళ్లీ ఇంకోసారి ప్యాంటుజేబులో చెయ్యిపెట్టాడు దీనదయాళ్? కానీ డబ్బులను బయటకు తియ్యలేదు. పక్కనే వున్న మనిషి తన చర్యను గమనిస్తున్నాడని అతనికి అనిపించింది. బావుండదని వూరుకున్నాడు. జేబులోనించి ఖాళీ చెయ్యి బయటకు వచ్చింది.

దీనదయాళ్ పక్కనే నిలుచున్న దీక్షితులుకు కూడా ఆకలవుతోంది. ఆయనకు చక్కెరవ్యాధి, బ్లడ్ ప్రెషర్ బాగానే వున్నాయి. ఆకలినీ, ఎండనీ తట్టుకోవడం కష్టంగా వుంది. బస్సు వచ్చేలాలేదు. బస్సు వచ్చినా ఇంటికి వెళ్లటానికి కనీసం గంటకు పైగా పడుతుంది. అంతసేపు తను భోజనం చెయ్యకుండా వుండగలడా? సాధ్యం అవకపోవచ్చు.

దీక్షితులు ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఉద్యోగం చేసి నాలుగేళ్ల క్రితం రిటైరయినాడు. ఆ బస్టాపు ప్రాంతంలో వున్న ఓ స్నేహితుడిని కలిసి తిరిగి ఇంటికి వెళుతున్నాడు.

బస్సు రాలేదు.

ఎండ తీవ్రత పెరుగుతోంది.

దీనదయాళ్ హోటలు వైపునకే చూస్తున్నాడు. తెలిసిన మనిషి ఒక్కడూ కనిపించలేదు. ఆ హోటలు బయట గోడకు ఒక నల్లటి బోర్డు ఆనించబడి వుంది. దానిమీద ఆ రోజు భోజనంలో పదార్థాల జాబితా చాక్‌పీస్‌తో పెద్ద అక్షరాలతో రాయబడి వుంది. ఆ పదార్థాల పేర్లను కొంచెం పెద్దగానే చదివాడు దీనదయాళ్. అన్నీ అతనికి ఇష్టమైన వంటకాలే! బంగాళదుంప వేపుడు అని రాసి వున్న పేరును రెండుసార్లు చదివాడు. అది అతనికి బాగా ఇష్టం. వారానికి రెండుసార్లయినా భార్య చేత చేయించుకుని తినేవాడు. అతనికి బాధ కలిగింది. తన తండ్రి పేదరికం కారణంగా మంచి ఉద్యోగం తెచ్చుకునేటంతటి చదువును చదువుకోలేక పోయాడు. తను చదివిన చదువుకు జీవితాంతం ఇలా షాపుల్లో గుమస్తా ఉద్యోగం చేస్తూ



వుండాల్సిందే! రేపు తన పిల్లల భవిష్యత్తు కూడా ఇంతే!

అతను ఇలా ఆలోచిస్తున్నప్పుడు పక్కనే వున్న దీక్షితులు దీనదయాళ్‌ను పిలిచాడు.

తల తిప్పి చూశాడు దీనదయాళ్.

దీక్షితులు నవ్వి ''వెళదామా'' అనడిగాడు.

''ఎక్కడికి సార్'' అడిగాడు.

''ఎదురుగా హోటలుకి''

''నేనా'' ఆశ్చర్యంగా అడిగాడు దీనదయాళ్.

''అవును. నువ్వే.. ఆకలిగా లేదూ'' మళ్లీ నవ్వాడు దీక్షితులు.

దీనదయాళ్‌కు ఏమీ అర్థం కాలేదు. ఈయనెవరు? తనని హోటలుకు రమ్మంటున్నాడు...

''నేను మీకు తెలుసా'' మళ్లీ అడిగాడు అనుమానం తీరక.

''తెలుసులే పద'' అన్నాడు అక్కడినించి కదులుతూ. దీక్షితులను అనుసరించాడు దీనదయాళ్.

హోటల్లోకి వెళ్లిన తర్వాత తనే డబ్బులిచ్చి రెండు భోజన టిక్కెట్లను తీసుకున్నాడు దీక్షితులు.

చెక్కబల్ల ఎదురుగా వున్న కుర్చీల్లో పక్కపక్కనే కూర్చున్నారు.

అరిటాకుల్లో భోజనం.

వడ్డిస్తున్నప్పుడు దీనదయాళ్ తన గురించి దీక్షితులుతో చెప్పాడు.

''నిజానికి నువ్వెవరో నాకు తెలీదు. నువ్వు మాటిమాటికీ చిల్లర డబ్బులను లెక్కవేసుకోటాన్ని బట్టి, భోజన హోటలు వైపు నీ చూపులను చూసి, నీ స్థితినీ, నీ ఆకలినీ నేను గ్రహించాను. అందుకే నిన్ను భోజనానికి రమ్మన్నాను'' అన్నాడు దీక్షితులు.

''నేనెవరో తెలీకుండానే నన్ను భోజనానికి తీసుకువచ్చారా'' విస్మయంగా అడిగాడు దీనదయాళ్.

''నువ్వెవరో నాకు తెలియకపోవచ్చు. కానీ నీ కడుపులో వున్న ఆకలిబాధ నాకు తెలుసు. ఆకలిబాధ అందరికీ ఒకే విధంగా వుంటుంది. భరించటం చాలా కష్టం. అంతేకాదు. మనుషుల్లో కొంతమంది మహాత్ములుంటారని అలాంటి మహాత్ముడికి ఒక్కపూట భోజనం పెడితే మనం చేసిన పాపాలు తొలగిపోతాయనీ, ఆ మహాత్ములను గుర్తించడం సాధ్యం కాదు కాబట్టి రోజుకో అతిధికి భోజనం పెట్టాలనీ చిన్నప్పుడు మానాన్న చెబుతూ వుండే వాడు. నాకు బాగా గుర్తుంది. ఇవాళ నువ్వే నా అతిధివి. బాగా ఆకలి మీద వున్నావు. నేను పాపాలు చేశానో లేదో నాకు తెలీదు. అయినా సందర్భం వచ్చింది కాబట్టి నా గురించి కూడా నీకు చెబుతాను'' అని ఆగాడు దీక్షితులు.

''చెప్పండి'' అన్నాడు దీనదయాళ్ క్యూరియస్‌గా.

''నాకు ఇద్దరు అబ్బాయిలు. ఒక అమ్మాయి. ప్రభుత్వ ఉద్యోగం చేసి రిటైరు అయ్యాను. పదవీ విరమణ తర్వాత నాకు వచ్చిన డబ్బును ఇద్దరు కొడుకులూ సమంగా పంచుకుని ఈ వృద్ధాప్యంలో మమ్మల్ని వదిలి వాళ్ల సుఖం వాళ్లు చూసుకుని వెళ్లిపోయారు. పెన్షన్‌తో ముగ్గురం బతుకుతున్నాం. ఇంకా మా అమ్మాయికి పెళ్లి చెయ్యాలి. మనుషుల్లో మానవత్వం అంతరించిపోయింది. ఎదుటి మనిషి కష్టాన్ని, బాధను ఎవరూ పట్టించుకోవడం లేదు. నీలాంటి ఆకలితో వున్న మనిషికి పట్టెడు అన్నం పెట్టిస్తే నా కొడుకుల మనసును ఆ దేవుడు మారుస్తాడని నా ఆశ. నాలోనూ స్వార్థం వుంది... అదిగో... బంగాళదుంప వేపుడు కూడా వచ్చింది. ఇక భోజనం చెయ్యి'' అన్నాడు దీక్షితులు ముందుకు వంగి.

ఎందుకో తెలీదు గానీ చివరగా ఆ మాటలు విన్నప్పుడు దీనదయాళ్‌కు ఏడుపు వచ్చింది.

''దైవం మానవ రూపంలో అంటే ఇదేనా?'' అని అడిగాడు దీనదయాళ్ కృతజ్ఞత నిండిన ఏడుపు గొంతుతో.

❋